క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో విఫలం

మరికల్: మండల కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేపట్టడంలో ఇక్కడి ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని కాంగ్రెస్ మండల అధ్యక్షులు వీరన్న, నాయకులు రామకృష్ణ, హరీష్, ఆంజనేయులు అన్నారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ గ్రామంలో డ్రెయినేజీలు అపరిశుభ్రంగా ఉండటం వల్ల ప్రమాదకరమైన వ్యాధులు గ్రామస్తులకు వ్యాపిస్తున్నాయన్నారు. ఇక్కడి పాలకులకు ధనార్జనపై ఉన్న శ్రద్ధ పారిశుద్ధ్యంపై లేదని విమర్శించారు. గ్రామంలోని ప్రధాన కాలనీల్లో డ్రెయినేజీలు పూడిక తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే ఉన్నత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

జెండా కట్ట ధ్వంసం అమానుషం



నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని 20, 21 వార్డులలోని టీడీపీ పార్టీ జెండా కట్టలను ధ్వంసం సరికాదని మహబూబ్‌నగర్ పార్లమెంట్ అధ్యక్షుడు మెట్టుకాడి శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన ఘటనా స్థలాలను పరిశీలించారు. జెండా కట్టలను పునర్ నిర్మాణం చేయాలన్నారు. పార్లమెంట్ జిల్లా ప్రచార కార్యదర్శి వినయ్‌మిత్ర యాదవ్, నాయకులు రాఘవరావు, భాస్కర్‌రెడ్డి, ప్రసాద్, మనోహర్, లక్ష్మణ, కేశవులు, యాబన్న, వీరన్న, బాలాజీయాదవ్, శ్రీకాంత్, రవికుమార్, కిష్టప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.
కోస్గి: జిల్లా కేంద్రంలో టీడీపీ జెండా కట్టను ధ్వంసం చేయడం అమానుషమని పార్టా జిల్లా అధికార ప్రతినిధి డీకే రాములు ఓ ప్రకటనలో ఖండించారు. జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్లో 30 ఏళ్ల క్రితం నిర్మించిన జెండా కట్టను కూల్చివేశారని అన్నారు. ఇలాంటి చర్యలు సరికావన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కుమ్మరి అంజిలయ్య, అంబదాస్, అచ్యుతారెడ్డి తదితరులు ఉన్నారు.

దూడలకు వ్యాక్సిన్



నారాయణపేట టౌన్ : పట్టణంలో పశువర్ధన శాఖ ఆధ్వర్యంలో రెండు నెలల నుంచి ఏడాది వయసున్న దూడలకు బుధవారం వ్యాక్సిన్ వేశారు. వీఎవో శంకర్, వెటర్నరీ కాంపౌండర్ ప్రతాప్‌లు వ్యాక్సిన్‌తో భవిష్యత్తులో దూడల గర్భసంచిలో ఎలాంటి సమస్యలు రావన్నారు. బీకేఎస్ రాష్ట్ర నాయకులు వెంకోబా, రైతులు పాల్గొన్నారు.

సత్తాచాటిన విద్యార్థులు



నారాయణపేట రూరల్ : గత నెలలో నిర్వహించిన పరీక్ష పే చర్చ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గ్రౌండ్‌స్కూల్ విద్యార్థిని అమృత వర్షిణి డ్రాయింగ్‌పోటీలో రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతి పొందింది. ఈమేరకు బుధవారం స్థానిక పాఠశాల ఆవరణలో అధ్యాపకులు, బీజేపీ నాయకులు అభినందించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ పంపిన మెమెంటోను అందించారు. కార్యక్రమంలో మైనోద్దిన్, ధర్మరాజు, జ్యోతి, ప్రభాకరవర్ధన్, రఘురామయ్యగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థిని అభినందించిన కలెక్టర్

నారాయణపేట రూరల్ : జేఈఈ మేయిన్స్‌లో 96.59శాతం మార్కులు సాధించిన ప్రైవేటు కళాశాల విద్యార్థి ఎం.వెంకటేష్‌ను కలెక్టర్ శ్రీహర్ష బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో అభినందించారు. శాలువా కప్పి మిఠాయి తినిపించారు. కార్యక్రమంలో శేషమ్మ, నర్సింహులు, శివకుమార్, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు. అదేవిధంగా తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ కళాశాల విద్యార్థి విద్యాసాగర్ 92.91శాతం మార్కులు సాధించడంపై ఆ కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వర్‌రెడ్డితో పాటు సిబ్బంది అభినందించారు.

పోస్టర్ విడుదల

ధన్వాడ: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 12న పాదయాత్ర నిర్వహించనున్నారు. బుధవారం కార్మికులు పోస్టర్‌ను విడుదల చేశారు. అధికసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. బాలకృష్ణ, వెంకటయ్య, పెంటయ్య, మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.



మార్మోగిన శివనామస్మరణ



మహాపూజ నిర్వహిస్తున్న భక్తులు



మద్దూర్‌లో కలశ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని లింగయ్య స్వామి దేవాలయంలో బుధవారం భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి మహాపూజను శివభక్తులు వైభవంగా నిర్వహించారు. స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఊరేగింపు చేపట్టారు. భక్తులు, మహిళలు, పట్టణ పుర ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.
మక్తల్: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావం కలిగి ఉన్నప్పుడే జన్మసార్థకమవుతుందని వేదపండితుడు తిప్పయ్య మహాస్వామి అన్నారు. గురువారం మక్తల్ పట్టణంలో మల్లికార్జున ఆలయం దగ్గర శివభక్తులు నిర్వహించిన 23వ మహాపడిపూజలో పాల్గొని మాట్లాడారు. మహాపడిపూజ సందర్భంగా మక్తల్ పట్టణం శివ నామస్మరణతో మార్మోగింది. పట్టణంలో శివభక్తులు కలశ ఊరేగింపు చేపట్టారు. పడమటి ఆంజనేయస్వామి ఆలయం నుంచి మల్లికార్జున స్వామి ఆలయం వరకు కార్యక్రమం సాగింది. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, మల్లికార్జున్, భక్తులు పాల్గొన్నారు.
మద్దూరు: శివభక్తుల ఆధ్వర్యంలో మద్దూరు పంచాయతీ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన మహామండపంలో ద్వాదశ జ్యోతిర్లింగాల మహాపూజ ఘనంగా నిర్వహించారు. శివకుమార్ స్వామి బృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ అరుణ దంపతులు, భక్తులు పాల్గొని విశేష పూజలు చేశారు. అంతకుముందు కలశ ఊరేగింపు చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. మోనేషాచారీ, బాల్‌చందర్ మల్లికార్జున్, అంజయ్య, వెంకట్‌రాములు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

ఊట్కూరు: మండలంలోని పగిడిమర్రి, ఊట్కూరు గ్రామ శివారులో కొనసాగుతున్న ఉపాధి పనులను బుధవారం ఎంపీడీఓ కాలప్ప పరిశీలించారు. పగిడిమర్రిలో చెరువు సమీపంలో కొనసాగుతున్న ఫీడర్‌కెనాల్ పనులను పరిశీలించి కూలీలకు తగు సూచనలు చేశారు. అదేవిధంగా నర్సరీలో మొక్కలను పరిశీలించి రోజు రెండు పూటలా నీరుపోసి సంరక్షించాలన్నారు. ఏపిఓ ఎల్లయ్య, ఈసీ చంద్రకాంత్, మొగులప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఫీడర్ కెనాల్ వద్ద కూలీలకు సూచనలు చేస్తున్న ఎంపీడీఓ కాలప్ప

'కరెంట్ కోతలతో పంటలు ఎండుతున్నాయి'

మరికల్: నిత్యం కరెంట్ కోతల కారణంగా వరి పంటలకు సాగునీరు అందడం లేదని, ఫలితంగా ఎండిపోతున్నట్లు రైతులు హన్మంతు, రాములు, మురళీలు అన్నారు. బుధవారం వారు విలేకర్లతో మాట్లాడుతూ 24 గంటల పాటు ఉచిత కరెంట్ సరఫరా చేస్తామని చెప్పిన ప్రభుత్వ మాట ఎక్కడుందన్నారు. పల్లెగడ్డ శివారులో సాగు చేసిన వరి పంటలకు నిత్యం కేవలం గంట మాత్రమే విద్యుత్ సరఫరా ఉంటోందన్నారు. ఇలా అయితే పంటలు ఎలా పడించాలని ప్రశ్నించారు. వ్యవసాయానికి 24 గంటల పాటు కరెంట్ సరఫరా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రాములు

ఊట్కూరు: ప్రజలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ రాములు కోరారు. బుధవారం ఊట్కూరులోని ఫోస్టాపీస్ ప్రాంతంలో పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మద్యం, గంజాయి, డ్రగ్స్, దూమపానం వంటి వాటికి చాలామంది యువత ఆకర్షితులై, భవిష్యత్తును దెబ్బతీసుకుంటున్నారన్నారు. అలాంటి వాటికి బానిసలు కారాదని అన్నారు. కొంతమంది యువకులు ఈ క్రమంలోనే నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. ఆన్‌లైన్‌లో అప్పులు తీసుకోవడం వల్ల వారు పెట్టే బాధలు భరించలేక చాలామంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మహేష్, చంద్రకళ, శివ, గోపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై పారుతున్న మురుగునీరు

కృష్ణా: మండలంలోని ముడుమాల్ గ్రామంలో మురుగునీరు రోడ్లపై పారుతోంది. దీంతో ప్రజలు, బాటసారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పక్షం రోజులుగా డ్రెయినేజీలో నీళ్లు నిండిపోవడంతో ఆ నీరు కాస్తా వీధుల్లో ప్రవహిస్తున్నదని, దీంతో వ్యాధుల బారినపడుతున్నారని వాపోతున్నారు. ఈ విషయంపై అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.



ముడుమాల్ వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు

బస్సు నడపాలని వినతి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నర్వ: మండలంలోని రాయికోడ్, పాతర్చేడ్, రాజుపల్లి గ్రామాలకు వనపర్తి డిపో నుంచి బస్సును నడపాలని మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ప్రతినిత్యం పదుల సంఖ్యలో విద్యార్థులు ఆత్మకూర్, కొత్తకోట, వనపర్తిలకు చదువుకునేందుకు వెళ్తుతుంటారని బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి వారు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని నిత్యం ఉదయం 7 గంటలకు, సాయంత్రం 5 గంటలకు బస్సును ప్రారంభించాలని కోరారు. బస్సును ప్రారంభిస్తే ఈ గ్రామాలతో పాటు, నాగిరెడ్డిపల్లి, నాగల్‌కడ్మూర్, యాంకి తదితర గ్రామాల విద్యార్థులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. సందర్భంగా డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. రాజుపల్లి సర్పంచ్ చిన్నారెడ్డి, రాయికోడ్ సర్పంచ్ సుజాత శ్రీనివాసులు, సత్యారెడ్డి, నర్సిములు తదితరులున్నారు.

'సమస్యలు గాలికి వదిలిన ప్రభుత్వం'

నారాయణపేట రూరల్ : ఉపాధ్యాయ సమస్యల సాధనే ధ్యేయంగా పనిచేస్తానని ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తపస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంత్‌రావు, ఉపాధ్యక్షులు మల్లికార్జున్, కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శేర్‌కృష్ణారెడ్డి, నర్సింహా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటనారాయణరెడ్డి

మరికల్: పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందని తపస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏ.వెంకటనారాయణ రెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మరికల్ ఎమ్మార్సీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఇష్టానుసారంగా ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టి వారి జీవితాలతో చెలగాటమడుతుందన్నారు. ఈసారి మొదటి ప్రాధాన్యత ఓటును వెంకటనారాయణరెడ్డికి వేసి గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి మార్గం లభిస్తుందని సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు హనుమంతురావు, మల్లికార్జున్, శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారెడ్డి, నాగరాజ్, సీతారాములు, గోవింద్, కనకప్ప, కిరణ్, సికిందర్, సురేష్‌లు పాల్గొన్నారు.
ధన్వాడ: మండల కేంద్రంలోని ఆయా విద్యాలయాల్లో తపస్ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి బుధవారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాక్షులు మల్లికార్జున్, కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు కృష్ణారెడ్డి నరసింహా, ఉపాధ్యాక్షులు నాగరాజు, సీతారాములు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు

స్టడీ మెటీరియల్ పంపిణీ

దేవరకద్ర రూరల్ : కౌకుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 84 మంది విద్యార్థులకు బుధవారం స్థానిక ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తండ్రి ఆల రఘుపతి రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ సహకారంతో మండల నాయకులు ఆల్‌ఇన్‌వన్ స్టడీ మెటీరీయల్‌ను పంపిణీ చేశారు. ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువులో రాణించాలని ఈ సందర్భంగా వారు సూచించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ సూజాత, ఎంపీటీసీ కిష్టన్న, సర్పంచ్‌లు శివరాజ్, రామకృష్ణ, శ్రీనివాస్, మండల నాయకులు శేఖర్ రెడ్డి, బాబుజాన్, శివకుమార్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర చెల్లించాలి

దేవరకద్ర రూరల్: పత్తి రైతులకు మద్దతు ధర చెల్లించాలని బుధవారం కౌకుంట్ల మండలంలో అఖిల భారత రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. పెరిగిన సాగు ఖర్చులతో పోలిస్తే ప్రస్తుతం ప్రభుత్వం పంటలకు అందిస్తున్న మద్దతు ధర సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాకు రూ.12,000 మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర గ్యారంటీ చట్టం చేయాలన్నారు. స్వామినాథన్ కమిషన్ చేసిన సిపార్సులు అమలు చేయడంతో పాటు రైతుల రుణాలను రద్దు చేసి, కౌలు రైతులకు రైతుబంధు అందించాలని డిమాండ్ చేశారు.

పాదయాత్రగా తరలిన శివభక్తులు



మాగనూర్: కొత్తపల్లి గ్రామం నుంచి గురువారం దాదాపు 30 మంది శివస్వాములు పాదయాత్రతో శ్రీశైలానికి బయలు దేరారు. అంతకు ముందు ప్రత్యేక పూజలు చేసి ఇరుముడులు ధరించారు. మాలాధారుల బంధువులు, కుటుంబ సభ్యులు, భక్తులు ఊరేగింపుతో వారిని సాగనంపారు.
నర్వ: మండలంలోని లంకాల్ గ్రామంలో బుధవారం శివస్వాములు పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరారు. ఆలయంలో శివస్వాముల ఇరుముడి ధారణ కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ..



కోస్గి: కొత్త మండల కేంద్రం గండుమాల్‌లో బుధవారం ఠాగూర్ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. స్వయం పరిపాలన దినోత్సవం సందర్భంగా ఒకరోజు ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. ప్రిన్సిపల్‌గా అఖిల, కలెక్టర్‌గా పాయల్, డీఈఓగా సాయి కుమార్, ఎంఈఓగా అవంతికతోపాటు పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహారించారు. ప్రతిభ కనబర్చిన వారికి పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేసింది. హెచ్‌ఎం సుధాకర్, కరస్పాండెంట్ వెంకటయ్యతో పాటు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అభినందన

మక్తల్: పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త లక్ష్మీనారాయణ గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఈ నేపథ్యంలో పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోండి

కోయిల్‌కొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శశికళ అన్నారు. బుధవారం మండలంలోని గార్లపహాడ్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. సర్పంచ్ ఆంజనేయులు, ఎంపీటీసీ విజయలక్ష్మి, నాయకులు యాదిరెడ్డి, వైద్యసిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సంతకాల సేకరణ

కోయిల్‌కొండ: గార్లపహాడ్ మండలంగా ప్రకటించాలని చుట్టు పక్కల గ్రామాల ప్రజలు, ప్రజాప్రతినిధులతో మండల సాధన సమితి సభ్యులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని అభంగపట్నంలో బుధవారం కొనసాగించారు. 17 రోజులుగా రిలే దీక్షలు చేస్తున్నామని ప్రభుత్వం వెంటనే స్పందించి మండల ప్రజల కోరికను నెరవేర్చాలని జేఏసీ నాయకులు వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. గార్లపహాడ్‌ను మరో మండలంగా చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కరపత్రాల విడుదల

అమరచింత: ఫిబ్రవరి 15 నుంచి 18 వరకు పశ్చిమ బెంగాల్‌లోని హౌరాలో నిర్వహించే వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం పాంరెడ్డిపల్లిలో ఆసంఘం ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు.

అటెన్షన్ ప్లీజ్

ప్రమాదకరంగా వంతెన



మాగనూర్: మండల పరిధిలోని నేరడగం గ్రామ సమీపంలోని పెద్ద వాగుపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జిపై ఉన్న సైడ్ రెయిలింగ్ ఒకవైపు కూలిపోయింది. మరో వైపు బ్రిడ్జి మొత్తం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా లోలెవల్ వంతెన కావడంతో వర్షాకాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మతులు చేయాలని, సమస్య పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఉపాధ్యాయులకు అండగా పీఆర్‌టీయూ

కోస్గి: రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పని చేసే ఉపాధ్యాయ సంఘానికి పట్టం కట్టాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని ముశ్రీఫా, పోతిరెడ్డిపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లతోపాటు నాచారం కేజీబీవీ పాఠశాలలో పీఆర్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. నాయకులు వార్ల మల్లేశం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.
కృష్ణా: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, అండగా పీఆర్‌టీయూ నిలుస్తోందని జిల్లా గౌరవ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డిలు అన్నారు. రాష్ట్ర సంఘం బలపరిచిన గుర్రం చెన్నకేశవరెడ్డికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మండలంలోని గుడెబల్లూర్, కున్సి, కృష్ణా, ముడుమాల్ తదితర పాఠశాలల ఉపాధ్యాయులను బుధవారం కలిసి మాట్లాడారు. కృష్ణా మండల అధ్యక్షుడు విరుపాక్షప్ప, గౌరవ అధ్యక్షుడు ఆశప్ప, ప్రధాన కార్యదర్శి శేఖర్, నాయకులు నాగరాజు, రాజేశ్వర్, సిద్దలింగప్ప, తాయప్ప, సురేందర్, మహేష్ పాల్గొన్నారు.



కున్సిలో ఉపాధ్యాయులతో నాయకులు

విద్యార్థులు ఉత్తమ స్థాయికి ఎదగాలి

మాగనూర్: పదవ తరగతిల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలన్న వీజేఆర్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు వలంటీర్లు, మాజీ సర్పంచ్ అశోక్‌గౌడ్ తదితరులు మందిపల్లిలో మెటీరియల్స్ పంపిణీ చేశారు. మెటీరియల్స్ కోసం 8367266777 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు, గురువులకు , గ్రామాలకు మంచి పేరు తీసుకోని రావాలని కోరారు. పీఏసీఎస్ డైరెక్టర్ రాఘవరెడ్డి, మాజీ ఎంపీటీసి ఉమేష్, గంప అంజప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మెటీరియల్స్ అందజేస్తున్న వలంటీర్లు

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు

నర్వ: మండలంలోని 11 గ్రామాలకు మంజూరైన సీసీ రహదారులను వెంటనే పూర్తిచేసి సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ జయరాములు శెట్టి అన్నారు. బుధవారం నర్వ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి హాజరుకాకపోవడంతో తూతూ మంత్రంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఏఈ మారెప్ప మాట్లాడుతూ.. మండలంలోని 6 గ్రామ పంచాయతీలకు భవనాల నిర్మాణానికి రూ.20 లక్షల చొప్పున మంజూరయ్యాయన్నారు. సీసీ రహదారులను గ్రామాల్లో వెంటనే చేపట్టి పూర్తి చేసుకునేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చొరవ చూపాలన్నారు. అనంతరం విద్యుత్, తాగునీరు, వైద్యంపై అధికారులు తమ నివేదికలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తమ సమస్యలను మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. వైస్ ఎంపీపీ వీణావతి, ఎంపీడీఓ రమేష్‌కుమార్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసంపూర్తి పనులతో ఇబ్బందులు



సివిల్ లైన్ రోడ్డులో ఉన్న దిమ్మె



మున్సిపల్ పార్క్ సమీపంలో..

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో అసంపూర్తి పనులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా చేస్తున్న పనులలో తీవ్ర జాప్యం వాహనదారులు ప్రమాదాల బారిన పడేందుకు కారణమవుతోంది. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి సివిల్‌లైన్, పాతబస్టాండ్ వరకు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా పాత కాలం నాటి ఐరన్ స్తంభాలు తొలగించారు. కానీ వాటి సంబంధించిన ఐరన్ దిమ్మెలను అలాగే వదిలేశారు. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ నుంచి సివిల్‌లైన్ వరకు, మున్సిపల్ పార్కు నుంచి ఎస్పీ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం రోడ్డు వద్ద సైతం ఐరన్ స్తంభాలకు సంబంధించిన దిమ్మెలు అలాగే ఉన్నాయి. స్తంభాలు తొలగించి నెలలు గడిచిపోయినా దిమ్మెలు తొలగించడం లేదు. దీంతో వాహనదారులు వాటిని గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

దిమ్మెలు తొలగించాలి

రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గతంలో ఐరన్ స్తంభాలను తొలగించారు. కానీ వాటికి సంబంధించిన దిమ్మెలు అలాగే ఉంచారు. దీంతో వాహనదారులు వాటిని గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దిమ్మెలు తొలగించాలి.

– ఓం ప్రకాశ్, నారాయణపేట

వైభవంగా గంధోత్సవం

నారాయణపేట టౌన్ : రాష్ట్ర సరిహద్దులోని కర్ణాటక అన్పూర్‌లో ఉర్సు ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. రాత్రి వైభవంగా గంధోత్సవం నిర్వహించారు. దారి పొడువునా భక్తులు గంధాన్ని దర్శించుకొని ఫాతేహాలు, చాదర్లు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముతవల్లి మహ్మద్ మునావర్ హుస్సేన్ ఖాద్రీ తదితరులు ఉన్నారు.



ప్రార్థనలు చేస్తున్న మత పెద్దలు

వేతనాల పెంపుపై హర్షం

నారాయణపేట టౌన్ : మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం రూ.3 వేలకు పెంచడం పోరాట ఫలితమేనని సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రాం అన్నారు. బుధవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో విజయోత్సవ సభను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేతనాల పెంపుపై హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా గౌరవ వేతనాన్ని రూ. 6 వేలకు పెంచాలని కోరారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, ఇందిరా, విజయలక్ష్మీ, ఆనంద, మహాదేవమ్మ, యాదమ్మ, రుక్మిణి, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

మక్తల్: అనుమతి లేకుండా ఇసుకను అక్రమరవాణ చేస్తున్న 2 ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నారు. చిట్యాల వాగు నుంచి ఇసుకను మక్తల్‌కు ట్రాక్టర్లలో తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో కర్నిశివారులో పట్టుకుని స్టేషన్‌కు తరలించామని ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు. కుర్వ మల్లేష్, మూడుమాల్ లక్ష్మన్నలపై కేసు నమోదు చేశామని వివరించారు.